# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-07-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ గోదావరి డెల్టాకు శాశ్వత రక్షణ కల్పించే చర్యలను ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.
- ❖ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.
- ❖ సామాజిక మధ్యమాలలో అభ్యంతరకరమైన పోస్టులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా జులై 15 నుంచి అమరావతి ఛాంపియన్‌షిప్ 2.0 క్రీడా పోటీలు ప్రారంభం కానున్నాయి.

=================

గోదావరి డెల్టాకు శాశ్వత రక్షణ కల్పించే చర్యలను ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేపట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీనిలో భాగంగానే సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ కు కొత్త గేట్లను అమర్చుతున్నామని చెప్పారు. ధవళేశ్వరం బ్యారేజ్ కొత్త గేట్ల నిర్మాణ పనులను ముఖ్యమంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ ద్వారా 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. 2027 గోదావరి పుష్కరాలకు ముందే బ్యారేజీ గేట్లను పునరుద్ధరణ చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్ట్‌లో 72 శాతం పనులను పూర్తి చేశామని తెలిపారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు రాబోతున్నాయని, పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వెల్లడించారు. గత రెండేళ్లలో సాగునీటి కోసం 24 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని, తుంగభద్ర గేట్లు కొట్టుకుపోతే మరమ్మతులు చేపట్టామని తెలిపారు. గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించే బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యానికి 24 గంటల్లో డబ్బులు జమ చేశామన్నారు. సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధిలో ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=================

గ్రామాలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతామని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట నియోజకవర్గం పోలాకి మండలంలో పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు బి.రమణమూర్తితో కలసి ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలన్నదే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. గృహాలు లేని వారందరికీ ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించి ఇళ్లు కట్టించే కార్యక్రమం అతి త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోతుందని స్పష్టం చేశారు. అర్హత ఉన్న వారికి కొత్త పెన్షన్లు త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. మహిళలకు ఉచితంగా మూడు సిలిండర్లు, తల్లికి వందనం, స్త్రీ శక్తి వంటి పథకాలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయన్నారు. `జల్ జీవన్ మిషన్` కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వ సహకారంతో.. రాష్ట్ర ప్రభుత్వ వాటాతో ఇంటింటికీ కొళాయి కార్యక్రమం చేపడుతున్నట్లు రామ్మోహన్ నాయుడు తెలిపారు.

=================

సామాజిక మధ్యమాల్లో అభ్యంతరకరమైన పోస్టులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను హోం మంత్రి ఈరోజు స్వీకరించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు ప్రతివారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ మంచి ఫలితాలను ఇస్తోందని తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఈ ఏడాది నేరాల రేటు 15 శాతం తగ్గిందని వెల్లడించారు. మహిళలపై జరిగే దాడుల్లో క్రైమ్ రేట్ 7 శాతానికి తగ్గిందన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అనిత పేర్కొన్నారు.

=================

భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన `మై భారత్-మేరా యువభారత్` పోర్టల్‌లో జిల్లాలోని యువత అంతా నమోదు చేసుకుని అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన ప్రత్యేక రిజిస్ట్రేషన్ డ్రైవ్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... దేశాభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించిన `వికసిత్ భారత్-2047` లక్ష్య సాధనలో యువత భాగస్వామ్యం కావాలని కోరారు. మై భారత్ పోర్టల్ ద్వారా యువత సామాజిక, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొని నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని తెలిపారు. జిల్లాలో హెల్పింగ్ హ్యాండ్స్, రెడ్ క్రాస్ వంటి సంస్థల ద్వారా వాలంటీర్లు విశేష సేవలు అందిస్తున్నారని, ఈ విషయంలో రాష్ట్రంలోనే పార్వతీపురం మన్యం జిల్లా ముందంజలో ఉందని చెప్పారు. పోర్టల్‌లో నమోదు చేసుకున్న యువతకు నైపుణ్యాభివృద్ధితో పాటు జాతీయ స్థాయిలో జరిగే కల్చరల్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాలు, క్విజ్ పోటీలు, శిక్షణ శిబిరాల్లో పాల్గొనే అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ వివరించారు.

విరామం

=================

పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. ప్రకాశం జిల్లా టంగుటూరులోని మహాత్మా జ్యోతిబా ఫూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితతో కలసి ఆయన ఈరోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగది, తరగతి గదులను మంత్రులు పరిశీలించారు. విద్యార్థినులతో ముచ్చటించి.. వారికి అందుతున్న విద్యా విధానం, భోజన వసతుల నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం విద్యార్థులు సాధించిన ఉత్తమ ర్యాంకులే ఇక్కడి విద్యా ప్రమాణాలకు నిదర్శనమని మంత్రి సవిత

కొనియాడారు. 45 కోట్ల రూపాయల సాస్కి (SASKI) నిధులు సింగరాయకొండ బీసీ రెసిడెన్షియల్ భవనానికి కేటాయించామన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే కొండేపి నియోజకవర్గానికి రెండు కొత్త బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరయ్యాయని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు.

=================

రాష్ట్రాన్ని `క్రీడా ఆంధ్రప్రదేశ్`గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ అనిమిని రవి నాయుడు పేర్కొన్నారు. విజయవాడలో ఈరోజు `అమరావతి ఛాంపియన్‌షిప్ 2.0 పోస్టర్`ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈనెల 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభంకానున్నాయని తెలిపారు. 175 నియోజకవర్గాల్లోనూ ఎంపికలు నిర్వహించి ప్రతిభావంతులైన క్రీడాకారులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. అండర్-17, అండర్-23 విభాగాల ద్వారా కొత్త ప్రతిభను వెలికితీస్తామన్నారు. ఈ ఛాంపియన్‌షిప్ వర్ధమాన క్రీడాకారుల ప్రతిభను వెలికితీసే వేదిక అవుతుందన్నారు. మారుమూల గ్రామాల నుంచి నగరాల వరకు ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనేలా చర్యలు చేపడుతున్నామన్నారు. పిల్లలు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. జిల్లా స్థాయి పోటీలు ఆగస్టు 1 నుండి 15వ తేదీ వరకు, రాష్ట్ర స్థాయి పోటీలు ఆగస్టు 20 నుండి 25వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. ఆగస్టు 29 జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రధానం చేస్తామని రవి నాయుడు వెల్లడించారు.

=================

ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమరావతి ఛాంపియన్ షిప్ పోటీల్లో యువ క్రీడాకారులు సత్తా చాటాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. విజయనగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఈరోజు క్రీడా సమరోత్సవాల కరపత్రాలను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి ఆగస్టు 26వ తేదీ వరకు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీల ప్రక్రియ ఉంటుందన్నారు. క్రీడలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలలో మంచి పేరు ప్రఖ్యాతలు కలిగిన విజయనగరం జిల్లా ప్రతిష్ట చాటి చెప్పేందుకు క్రీడాకారులకు ఇదొక మంచి అవకాశం అని, రాష్ట్ర స్థాయిలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని మంత్రి సూచించారు.

=================

వియత్నాం పడవ ప్రమాద బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈ పడవ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మచిలీపట్నానికి చెందిన గెల్లి జయశ్రీ కుటుంబ సభ్యులను మంత్రి ఈరోజు పరామర్శించారు. గెల్లి కిశోర్‌కు వియత్నాంలో మెరుగైన వైద్యం అందుతోందని, ఆందోళన చెందొద్దని వారి పిల్లలకు భరోసా ఇచ్చారు. వియత్నాంలో కిశోర్‌కు సహాయంగా వెళ్లిన కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రేపు సాయంత్రానికి జయశ్రీ భౌతిక కాయం విజయవాడ రానుందని, మంగళవారం కుటుంబ సభ్యులకు అందిస్తామని అధికారులు చెప్పినట్లు మంత్రి తెలియజేశారు.

=================
=================